క్లుప్తంగా

పుంతదారుల అభివృద్ధికి హామీ



పద్మశ్రీ, ప్రసాద్‌లను సత్కరిస్తున్న దృశ్యం

టి.నర్సాపురం: పుంతదారుల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ హామీ ఇచ్చారని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు కె.జగ్గవరం సహకార సంఘ చైర్మన్ వాసిరెడ్డి మధు తెలిపారు. ఏలూరులో జెడ్పీ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో గురువారం చైర్‌పర్సన్ పద్మశ్రీ, ప్రసాద్‌లను కలిశామన్నారు. 20 ఏళ్లుగా గ్రామాల్లో రైతులకు అవసరమైన పుంత రహదారులను ఏమాత్రం అభివృద్ధి చేయలేదని వివరించామని చెప్పారు. పుంత రహదారుల అభివృద్ధికి ఆమె సానుకూలంగా స్పందించారని చెప్పారు. పద్మశ్రీని కలిసిన వారిలో సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ ఒంటిపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు కొల్లి పురుషోత్తం చౌదరి ఉన్నారు.

ఎస్సై జయబాబుకు సన్మానం



జయబాబు దంపతులను సన్మానిస్తున్న సీఐ, తదితరులు

బుట్టాయగూడెం: ఎస్సై ఎం.జయబాబు, జ్యోతి దంపతులను స్థానిక పోలీసులు, గ్రామ యువకులు బుధవారం రాత్రి ఘనంగా సన్మానించారు. బుట్టాయగూడెం నుంచి ఆయన తడికలపూడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జీలుగుమిల్లి సీఐ బి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ప్రత్యేక పరిస్థితులున్నప్పటికీ జయబాబు అందరిని మన్ననలూ పొందారని కొనియాడారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ వివాదాస్పద అంశాల జోలికి వెళ్లకుండా తన విధులను సక్రమంగా నిర్వర్తించారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్ కృష్ణ మూర్తి, సిబ్బంది ప్రసాద్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తడికలపూడి ఎస్సైగా జయబాబు

చింతలపూడి: కామవరపుకోట మండలం తడికలపూడి ఎస్సైగా ఎం.జయబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో ఆయన బుట్టాయిగూడెం స్టేషన్ నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన కె.వెంకన్న బాబును బుట్టాయిగూడెం స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

మహిళా రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలి

ఏలూరు (టూటౌన్): మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి కోరారు. మహిళలపై జరుగుతోన్న హింసపై యాత్ర సదస్సు స్థానిక పవరుపేటలోని ఐద్వా కార్యాలయంలో పి.హైమావతి, జి.శారద అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాదేవి మాట్లాడుతూ నిందితులకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులో త్వరితగతిన విచారణ చేసి కఠినమైన శిక్షలు విధించాలన్నారు. ప్రభుత్వం, మీడియా మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని, హింస, అశ్లీల అసమానతలను ప్రేరేపించే చిత్రాలను, టీవీ సీరియల్స్, ఇంటర్నెట్ కార్యక్రమాలను నిషేధించాలని కోరారు. కాలేజీల్లో, పని ప్రదేశాల్లో వేధింపులు నిరోధక చట్టాలను అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. మద్యం, మత్తుమందు పదార్థాలను నియంత్రించే చర్యలు చేపట్టాలని కోరారు. మండలానికి ఒక్క మద్యం షాపు మాత్రమే అనుమతించాలని, మహిళలకు విద్యా, ఉపాధి హక్కుగా గుర్తించి అమలు చేయాలని అన్నారు. నిజాన్ని నిర్భయంగా చెప్పే తులసి చందు లాంటి జర్నలిస్టులపై బెదిరింపు చర్యలు అరికట్టాలని, తులసీ చందుకు మహిళా సంఘం అండగా నిలబడుతుందని తెలిపారు. ఈ యాత్రలో మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. సదస్సులో మహిళా సంఘంనాయకులు వి.వెంకటరమణ, ఉషారాణి, సీహెచ్ ఆందోళనమ్మ, వరలక్ష్మి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగాన్ని 500 యూనిట్లకు పెంచాలి

ఏలూరు (టూటౌన్): పెన్షన్‌దారులకు 300 యూనిట్ల విద్యుత్ వినియోగం నిబంధనను సడలించి 500 యూనిట్లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక మండలి మాజీ సభ్యుడు పులి శ్రీరాములు ఒక ప్రకటనలో కోరారు. వేసవి దృష్ట్యా ఎండలకు తట్టుకోలేక వృద్ధులు ఎక్కువగా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వాడిన కారణంగా గత మూడు నెలలుగా విద్యుత్ వాడకం 300 యూనిట్లకు పైగా పెరిగి బిల్లులు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో తమకు నెలనెలా వచ్చే పింఛన్ పోతుందేమోనని భయాందోళనలు వృద్ధుల్లో నెలకొందని పేర్కొన్నారు. విద్యుత్ వాడకాన్ని 500 యూనిట్లకు పెంచి, యథావిధిగా నెలవారీ పింఛన్‌ను అందించాలని విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



ద్వారకాతిరుమలలో నారసింహ స్వామి



శాకంబరి అలంకరణలో విజయదుర్గమ్మ



కుక్కునూరు శివాలయంలో శివలింగం

భక్తులతో కళకళలాడిన ఆలయాలు

ద్వారకాతిరుమల: స్వాతి నక్షత్రం, తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక శ్రీవారి దత్తత ఆలయమైన ఐఎస్ జగన్నాథపురం సుందరగిరిపై కొలువైన లక్ష్మీ నరసింహ స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత ఆలయ యాగశాలలో సుదర్శన నారసింహ ధన్వంతరి, గరుడ, ఆంజనేయ, అనంత హోమాలు చేశారు. గర్భాలయంలోని నారసింహుని మూలవిరాట్‌కు అర్చకుడు ఈశ్వరశర్మ పంచామృతాభిషేకాలు నిర్వహించి, పంచ హారతులిచ్చారు. ఈ సందర్భంగా దాత పుల్లారావు దంపతుల చేతుల మీదుగా భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అమ్మవారికి బోనాల సమర్పణ

జంగారెడ్డిగూడెం: స్థానిక పాత ఆంధ్రాబ్యాంక్ వీధి విజయ దుర్గమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి భక్తులు 108 బోనాలు శోభాయాత్రగా గంగానమ్మ ఆలయం మీదుగా విజయదుర్గమ్మవారికి సమర్పించుకున్నారు. బోనాలు సమర్పించిన భక్తులకు పసుపు కుంకుమ అమ్మవారి శేష వస్త్రాలు కమిటీ వారు అందజేశారు. ఈమని శశి కుమార్ పండితులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామ్మోహన్ రావు, జాయింట్ సెక్రెటరి రామిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శయన ఏకాదశి వేడుకలు

కొయ్యలగూడెం: తొలి ఏకాదశి (శయన ఏకాదశి)ని పురస్కరించుకుని కొయ్యలగూడెం రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహావిష్ణువు యోగ నిద్రలోకి ఉపక్రమించే రోజు తొలి ఏకాదశి అని నాలుగు నెలల పాటు ఆయన యోగ నిద్రలో ఉంటారని, దీనికి చాతుర్మాస దీక్ష అని కూడా పేర్కొంటారని, తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశికి మేల్కొంటారని బ్రహ్మశ్రీ అనిపెద్ది వెంకట నరసింహ శర్మ వివరించారు. అంకాలగుడెంలో రజక సేవా సంఘం సభ్యులు విధమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కుబడులు తీర్చుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించుకున్నారు. కన్నాపురం, అంకాలగూడెం, పులివాగు, ఎర్రంపేట, కొయ్యలగూడెం శివాలయాల్లో పూజలు, గ్రామ దేవతల ఆలయాల వద్ద తొలి ఏకాదశి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కడకట్ల ఏడుకొండలు, కోమటిగుంట నాగు, కడకట్ల శ్రీను, పెద్దింట్లమ్మ, రాంబాబు, సతీష్, పోసమ్మ, మమత, అర్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తొలిఏకాదశి ప్రత్యేక పూజలు

కుక్కునూరు: తొలిఏకాదశి సందర్భంగా గురువారం మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుక్కునూరు కాశీ అన్నపూర్ణసమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో, కొర్లకుంట రామాలయం, సాయిబాబా ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజలు చేశారు. కుక్కునూరు శివాలయంలో శివలింగానికి పంచామృతాలతో అభిషేక పూజలు నిర్వహించి స్వామి వారిని విశేషంగా అలంకరించారు. ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి ఏకాదశి ఉత్సవం



క్షేత్ర పురవీధుల్లో తొళక్క వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చినవెంకన్న దివ్య క్షేత్రంలో శ్రీవారి గ్రామోత్సవం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో తొళక్క వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి అర్చకులు విశేష పుష్పాలంకరాలు చేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి ముంగిట స్వామి, అమ్మవార్లకు భక్తులు నీరాజనాలను సమర్పించారు.



ద్వారకాతిరుమల ఆలయ యాగశాలలో కలశ పూజ



జంగారెడ్డిగూడెంలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు



అంకాలగూడెంలో అమ్మవారికి పూజ చేసిన భక్తులు

విలువలకు, త్యాగానికి ప్రతీక బక్రీద్



చింతలపూడి ఈద్గాహ్‌లో బక్రీద్ విశిష్టతను వివరిస్తున్న ఇమామ్



జంగారెడ్డిగూడెం ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పోలవరంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు

చింతలపూడి: బక్రీద్ పండుగను పట్టణంలోని ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఈద్గాహ్‌లో ముస్లింలచే ఇమామ్ షేక్ అబ్దుల్ వదూద్ బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. బక్రీద్ విశిష్టతను వివరించారు. విలువలకు, త్యాగానికి బక్రీద్ పండుగ ప్రతీక అని ఇమామ్ అన్నారు. ప్రార్థనల అనంతరం ఖబర్‌స్థాన్‌కు చేరుకుని దివంగత కుటుంబ సభ్యుల ఆత్మశాంతికి ప్రార్థనలు చేశారు. రాఘవాపురం, ప్రగడవరం, యర్రగుంటపల్లి, సీతానగరం గ్రామాల్లోనూ బక్రీద్‌ను ఘనంగా నిర్వహించారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: బక్రీద్ సందర్భంగా స్థానిక ఆరు మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బైనేరు వాగు వద్ద గల ఈద్గాలో ప్రార్థనలు నిర్వహించారు. బిలాల్ మసీద్ అధ్యక్షుడు షేక్ జిలాని, ఉపాధ్యక్షుడు ఖాజా, షేక్ బాజాని, సలీమ్, పఠాన్ పర్వేజ్, షేక్ హమీద్, మదీనా మసీద్ అధ్యక్షుడు సయ్యద్ షాజహాన్, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం మండలంలో..

కొయ్యలగూడెం: బక్రీద్ వేడుకలు కొయ్యలగూడెం జామియా మసీదు, చిన్న మసీదు, ఎర్రంపేట, రాజవరం, బయ్యన్నగూడెం, వేదాంతపురం, కన్నాపురం గ్రామాల మసీదుల వద్ద భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు దాన కార్యక్రమాలు నిర్వహించారు.

పోలవరంలో..

పోలవరం రూరల్: బక్రీద్ పర్వదినం పురస్కరించుకుని పోలవరం మండల కేంద్రంలో దర్గా వద్ద ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని సామూహికంగా అల్లాకు ప్రత్యేక ప్రార్థనలు చేశామని ప్రెసిడెంట్ యాసీన్ షరీఫ్ తెలిపారు. ప్రెసిడెంట్ యాసీన్ షరీఫ్, వైస్ ప్రెసిడెంట్ అహ్మద్ బాషా, సెక్రెటరీ అహ్మద్ అలీ, క్యాషియర్ సలీం, పోలవరం పరిసర గ్రామాల ముస్లింలు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం మసీద్ కమిటీ ఎన్నిక

బుట్టాయగూడెం: మండలంలోని బుట్టాయగూడెం, రామన్నగూడెం, నందాపురం, పులిరామన్నగూడెం, దొరమామిడి గ్రామాల్లో బక్రీద్ ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బుట్టాయగూడెం నూతన మసీద్ కమిటీని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా షేక్ ఇమామ్ సాహెబ్, వైస్ ప్రెసిడెంట్ షేక్ బాజీ, కార్యదర్శి ఎస్‌కే ఏపీ బాజీ, కోశాధికారి ఎస్‌కే మస్తాన్, 10 మంది సభ్యులుగా ఎన్నుకున్నట్టు ఇమామ్ సాహెబ్ తెలిపారు.

టి.నర్సాపురంలో..

టి.నర్సాపురం: బక్రీద్‌ను టి.నర్సాపురంలో ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇస్లాం మత ప్రబోధకులు హఫీజ్ సాబ్ ఖుర్బాని ప్రత్యేకతను వివరించారు. ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఎస్సై సతీష్ కుమార్ నేతృత్వంలో స్థానిక మసీదుల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మతపెద్దలు షేక్ అబ్బాస్, షరీఫ్, సింగరేణి కార్మిక నాయకులు సయ్యద్ నా సర్ పాషా, ముస్లింలు పాల్గొన్నారు.

కుక్కునూరు మండలంలో..

కుక్కునూరు: మండలంలోని ముస్లింలు గురువారం బక్రీద్ ఘనంగా నిర్వహించారు. ముస్లింలు కుక్కునూరు మండల కేంద్రంలోని ఈద్గాలో ప్రార్థనలు చేశారు.



బుట్టాయగూడెం ఈద్గా వద్ద సమావేశమైన ముస్లింలు



కొయ్యలగూడెం జామియా మసీదులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



టి. నర్సాపురంలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

ఏపుగుంటలో అగ్ని ప్రమాదం

టి.నర్సాపురం: మండలంలోని ఏపుగుంటలో బొక్కా గంగరాజుకు చెందిన తాటికిల్లు గురువారం రాత్రి దగ్ధమైంది. ఇంట్లో వంట చేస్తున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గ్యాస్ బండ సమీపంలో మంటలు రావడంతో బండ రెగ్యులేటర్ ఊడి గ్యాస్ వెదజల్లడంతో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో బొక్కా గంగరాజు స్వల్పంగా గాయపడ్డాడు. రెండు ద్విచక్ర వాహనాలు, టీవీతో సహా ఇంటిలో సామగ్రి మొత్తం కాలిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో బయటపడ్డారు. చింతలపూడి ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో 3 లక్షల నష్టం సంభవించిందని ప్రాథమిక అంచనా వేశారు.



దగ్ధమవుతున్న తాటాకిల్లు

సంక్షేమ సారథి సీఎం జగన్



ధర్మాజీగూడెంలో పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం: అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి అందిస్తోన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు సంక్షేమ సారథిగా కొనియాడుతున్నారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం సచివాలయం పరిధిలో ఆయన గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆదర్శపాలన అందిస్తోన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు సీఎంను చేసుకోవాలని కోరారు. నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే సీఎం జగన్ లక్ష్యమన్నారు. ప్రతి ఇంట్లో నవరత్నాలు ద్వారా లబ్ధి చేకూరిందని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని, మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో గామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తూరి మౌనిక, సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, ఎంపీటీసీ మేకల రాజ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, పార్టీ ధర్మాజీగూడెం అధ్యక్షుడు మేకల రాజు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, ఏఎంసీ డైరెక్టర్ కుప్పాల రామకృష్ణ, సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు తాడేపల్లి శాంతరావు, కొత్తూరి రమేష్, నూతలపాటి శ్రీను, గారపాటి రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

నేడు మధ్యాహ్నం రెండు గంటలకు..

గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు ధర్మాజీగూడెంలో నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఎమ్మెల్యే ఎలీజా పాల్గొనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు బుట్టాయగూడెంలో సదరం శిబిరం

బుట్టాయగూడెం: వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం సదరం శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. వికలాంగులకు అవసరమైన పరికరాలు, చదువుకుంటున్న వికలాంగులకు లాప్‌టాప్‌లు అందజేస్తారని పేర్కొన్నారు. ఉపాధికి సంబంధించిన రుణం కూడా ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల పరిధిలోని వికలాంగులతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తునికాకు కూలీలకు అందని డబ్బులు

కుక్కునూరు: తునికాకు సేకరణ పూర్తయి దాదాపు నెలరోజులు గడుస్తున్నా కూలి డబ్బుల అందక మండలంలోని తునికాకు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో తునికాకు సేకరణకు ముందే ఎంతో కొంత అందజేసేవారని, పని పూర్తైన వెంటనే డబ్బులు చెల్లించేవారని, నేడా పరిస్థితి లేదని కూలీలు ఆరోపిస్తున్నారు. తునికాకు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ కూలీలకు నయా పైసా కూడా చెల్లించలేదని వాపోతున్నారు. అటవీశాఖాధికారులు ఇప్పటికైనా కూలీల చెల్లింపుపై చర్యలు చేపట్టాలని కూలీలు కోరుతున్నారు.

గోవిందుడిగా జగన్నాథుడి దర్శనం



జగన్నాథస్వామివారు

ద్వారకాతిరుమల: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన వేంకటేశ్వర స్వామిగా జగన్నాథస్వామి గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాసుని దివ్య మంగళ స్వరూపాన్ని పెద్దఎత్తున భక్తులు దర్శించి, తరించారు. లక్ష్మీపురం ఆలయంలో జగన్నాథుని రథోత్సవాలను పురస్కరించుకుని స్వామివారు ఆలయ మండపంలో రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలతో పాటు ఈ ప్రత్యేక అలంకరణలు సైతం గురువారంతో ముగిశాయని ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు.

జూట్ మిల్లు మూసివేత బాధాకరం

ఏలూరు (టూటౌన్): 118 ఏళ్ల పాటు కొనసాగిన ఏలూరు శ్రీకృష్ణా జూట్ మిల్లు శాశ్వతంగా మూతపడటం బాధాకరమని ఇఫ్టూ జిల్లా కమిటీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 22న జేసీఎల్ సమక్షంలో జరిగిన అగ్రిమెంట్‌పై యాజమాన్యం, ఆరు కార్మిక సంఘాలు సంతకాలు చేసే పరిస్థితి రావటం విచారకరమని తెలిపింది. ఐదు తరాలుగా కార్మికుల శ్రమశక్తి మీద ఆధారపడి కలకత్తాకు చెందిన భర్తీయా, లునాని కుటుంబాలు లాభాలు ఆర్జించాయని పేర్కొంది. దీనికి అనుబంధంగా కొత్తూరు జూట్ మిల్లు స్థాపించడంతో పాటు గుంటూరు, రాయపూర్ మిల్లులను కొనుగోలు చేశారని వివరించింది. రాజీనామా చేయకుండా మిగిలిన 600 మంది కార్మికులకు తమకు రావాల్సిన రాయితీలు, ఇతర అంశాలపై జేసీఎల్ సమక్షంలో అంగీకారం కుదిరిందని, దీన్ని కొన్ని కార్మిక సంఘాలు విమర్శించడం తగదని పేర్కొంది. ప్రకటన విడుదల చేసిన వారిలో ఇఫ్టూ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు ఉన్నారు.

పత్రికా ప్రకటన

తెలంగాణా రాష్ట్రం, ఖమ్మం జిల్లా, సిద్దారం, గౌరిగూడెం గ్రామ కాపురస్తులు, తోట రాముదాసు గారి కుమారుడు తోట సత్యనారాయణ అను నేను ఇందుమూలముగా యావన్మందికి తెలియ పరచునది ఏమనగా, [illegible] నా తల్లి గారైన తోట సీతామహాలక్ష్మి గారు [illegible] శ్రీ చింతలపూడి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో చింతలపూడి మండలం, [illegible] గ్రామం [illegible] 112-2 [illegible] 1-00 [illegible] ది.5.3.1984 [illegible] 245/1984 [illegible] 112-2 [illegible] 0-72 [illegible] ది.24.01.1969 [illegible] 68/1969 [illegible] 1-72 [illegible] ది.19.10.2001 [illegible] లేదా నెం.90105 59858 [illegible]

నా చిరునామా:
తోట సత్యనారాయణ, తండ్రి రాముదాసు,
గౌరిగూడెం, సిద్దారం, ఖమ్మం జిల్లా,
తెలంగాణా రాష్ట్రం.

ఇట్లు,
తోట సత్యనారాయణ
90105 59858

ది. 29-06-2023